ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 14 ఏప్రిల్ 2025



● గుంటూరు
ఏటి అగ్రహారం ప్రాంతానికి చెందిన యువకుడు ఆరేళ్ల కిందట న్యాయ విద్య పూర్తి చేసి సొంతంగా ప్రాక్టీస్ చేసుకుంటున్నాడు. ఐదేళ్ల నుంచి కుటుంబ సభ్యులు సంబం. దాలు చూస్తున్నా ఇప్పటికీ కుదరలేదు.

మారుతున్న అమ్మాయిల అభిరుచులు..

ఇటీవలి కాలంలో యువతుల అభిరుచులూ మారుతున్నాయి. గతంలో అమ్మాయి తరపు వారికి అబ్బాయి నచ్చితే సరిపోయేది. కాని, ఇప్పుడు అమ్మాయిలకు నచ్చితేనే పెళ్లికి ముందుకు వెళ్తున్నారు. అబ్బాయి వయస్సు, సంపాదన, కుటుంబ నేపథ్యం, ఆస్తులు ఇలా అన్ని చూసుకున్న తర్వాతనే ఒప్పు కుంటున్నారు. ముఖ్యంగా పెద్ద కుటుంబాలను కోరుకునేందుకు ఇష్టపడడం లేదు. పెళ్లి కాగానే వేరు కాపురం పెడుతారా..? లేదా..? అన్న కోణంలోనే అమ్మాయిలు చూస్తున్నారు. తమ పిల్లలకు కష్టం వాటిల్లకుండా ఉండాలన్న తపనను తల్లిదండ్రులు ప్రదర్శిస్తున్నారు.



నాకో క శ్రీమతి కావాలి

పెళ్లెప్పుడవుతుంది బాబూ.. నాకు పిల్ల యాడ దొరుకుతుంది బాబు.. దశాబ్దాల క్రితం రాసిన ఈ సినిమా పాట ప్రస్తుత పరిస్థితులకు అతికినట్టు సరిపో తుంది. పెళ్లి రెండు జీవితాలను ముడివేసే బంధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రతి ఒక్కరి జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం. అయితే మూడు ముళ్లతో ఏకం కావాలని కోరుకునే ఎంతోమంది అబ్బాయి లకు ఈ మధ్య కాలంలో పిల్ల దొరకడం లేదు. ఒకటి రెండు కాదు మెజార్టీ సామాజిక వర్గాల్లో అమ్మాయిల కొరత వేధిస్తుంది.

- పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు
- మెజార్టీ కమ్యూనిటీల్లో అమ్మాయిల కొరత
- మారుతున్న యువతుల అభిరుచులు
- కష్టమవుతున్న పెండ్లి సంబంధాలు
- వివాహ పరిచయ వేదికలకు పెరుగుతున్న క్యూ
- అబ్బాయిల తల్లిదండ్రుల్లో ఆందోళన
- కొన్ని ప్రాంతాల్లో అమలవుతున్న కన్యాశుల్కం



గుంటూరు, సంగడిగుంటకు చెందిన ఓ యువకుడు ఎనిమిదేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.60 వేలకుపైగానే జీతం వస్తోంది. మూ డేళ్లుగా తల్లిదండ్రులు పెళ్లి ప్రయ త్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకూ సంబంధం కుదరలేదు.

గుంటూరు విద్యానగర్‌కు చెందిన యువకుడు హైదరా బాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో రూ.80 వేలతో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో ఆస్తులు బాగానే ఉన్నాయి. అయినా మూడేళ్లుగా పెళ్లి సెట్ కాలేదు.

డొకిపర్రు గ్రామానికి చెందిన ఓ యువకుడు బేల్దారు మేస్త్రిగా ఉంటూ నెలకు రూ.50 వేలకు పైగా సంపాదిస్తున్నాడు. గ్రామాల్లో పొలం, ఇతర ఆస్తులు ఉన్నాయి. ఐదేళ్ల నుంచి పెళ్లి ప్రయత్నాలు సాగిస్తున్నా సంబంధం కుదరలేదు.

రూరల్ మండలం, ఓ గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన యువ రైతుకు పెళ్లి కావడంలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు విజయనగరం జిల్లాకు వెళ్లి ఎదురు రెండు లక్షలు ఇచ్చి ఓ బలహీన వర్గానికి చెందిన యువతితో వివాహం చేశారు.





గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని యువ కుల పరిస్థితి. చదువు, జీతం, ఆస్తులు, హోదా ఉన్నా పెళ్లిళ్లు కుదరడంలేదు. మూడు పదుల వయసు దాటు తున్నా పెళ్లి కాని వారి సంఖ్య ప్రస్తుతం అన్ని సామా జిక వర్గాల్లో తీవ్రమవుతోంది. గతంలో ఆడపిల్ల ఇంట్లో ఉంటే గుండెల మీద కుంపటి అనుకునేవారు. కట్నకా నుకలు ఇవ్వడానికి అప్పు చేసేవారు. ఇప్పుడు ఇదంతా పూర్తిగా మారింది. కట్నం మాట దేవుడెరుగు, అమ్మా యి వివాహం చేసుకోవడానికి ఒప్పుకుంటే చాలన్న ట్లుగా అబ్బాయిలు, వారి తల్లిదండ్రులు ఎదు రుచూస్తున్నారు.

● పరిచయ వేదికలకు అబ్బాయిల క్యూ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ సామా జిక వర్గంలో అమ్మాయిలు కొరత అధికం గా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని.. ఆ సంఘం పెద్దలు ఓ ఆలోచన చేసి.. వధూవరుల వివరాల సేకరణకు సం ఘం ఆధ్వర్యంలో ఒక రిజిస్టర్ నిర్వహి స్తున్నారు. అయితే గడిచిన ఎనిమిది నెలల్లో 2140 మంది అబ్బాయిలు, 830 మంది అమ్మాయిలు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో సదరు సంఘం ఇప్పటికి మూడుసార్లు పరిచయ వేదికలు నిర్వ హిస్తే.. ఇద్దరూ ఒక్క టైంది కేవలం 79 మంది మాత్రమే. ఈ తరహా పరిచయ వేదికలకు అబ్బాయిలు క్యూ కడుతున్నారే తప్ప.. అమ్మాయిల సంఖ్య నానాటికి తగ్గుతుంది. గుంటూరులో ఇటీవల ఓ ప్రధాన సామాజిక వర్గానికి చెందిన వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయగా 70 శాతం అబ్బాయిలు వస్తే.. 30 శాతం అమ్మాయిలు వచ్చారు.

● మానసిక సమస్యలు..

పెళ్లికాకపోవడం వల్ల యువకులతోపాటు వారి తల్లిదండ్రులు మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. 30 ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడం వల్ల అబ్బాయిల్లో అసహనం, నిరుత్సాహం వంటివి పెరిగి పోతున్నట్లు మానసిక వైద్యులు చెబుతున్నారు. పెళ్లెప్పుడు అని పలువురు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తీవ్రమైన ఒత్తిడిని అనుభవిస్తున్నారు.

● నిర్దిష్ట అభిప్రాయాలు లేని తల్లిదండ్రులు

పెళ్లిళ్లు ఆలస్యమవ్వడానికి అబ్బాయిలు, అమ్మాయి ల తల్లిదండ్రుల వ్యవహారశైలి మరో కారణంగా చెప్ప వచ్చు. మంచి కట్న కానుకలు ఆశించడం, అమ్మాయి అందంగా ఉండాలని, అణకువగా ఉండాలని కోరుకుం టూ మొదట్లో వచ్చిన సంబంధాలను కాదనుకుం టున్నారు. ఆ తర్వాత వయసు దాటిపోతున్నా అబ్బా యిలకు పెళ్లిళ్లు చేయలేని పరిస్థితి నెలకొంటోందని చెబుతున్నారు. కట్నంతోపాటు బంగారం, భూములు ఇవ్వాలన్న షరతులను అమ్మాయిల తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. మరోవైపు అబ్బాయికి ఆస్తి, లక్షల జీతం ఉండాలని అమ్మాయిల తల్లి దండ్రులు ఆశిస్తున్నారు.

రైతులకు, కులవృత్తుదారులకు పిల్లను ఇవ్వం

రైతులకు, కులవృత్తులు చేసుకునే వారికి పిల్లనిచ్చేందుకు ఆడపిల్లల తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. ఉద్యోగాలు చేసే వారి కంటే ఎక్కువ సంపాదన, ఆస్తులు ఉన్నప్పటికీ పిల్లనివ్వడానికి ఆసక్తి చూపించడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాం తాల్లో అగ్రకుల సామాజిక వర్గానికి చెందిన వారికి 20 ఎకరాల పొలం ఉన్నప్పటికీ పెళ్లి కావడం లేదు. ప్రతి గ్రామంలో 30 నుంచి 50 మంది వరకు పెళ్లి కా కుండా ఉంటున్నారని ఈ మధ్య నిర్వహించిన సర్వేలో తేలింది. దీంతో అబ్బాయిలు తల్లిదండ్రులు వేరే జిల్లా లకు వెళ్లి ఇతర కులాలకు చెందిన అమ్మాయిలను తెచ్చి పెళ్లి చేస్తున్నారు.

అందుబాటులో వీకెండ్ మ్యారేజ్

ఇప్పటివరకు సహజీవనంతో కాలంగడుపుతున్న యువత జీవితాల్లో వీకెండ్ మ్యారేజ్ అనే కాన్సెప్ట్ వైపు వెళుతున్నారు. పెళ్లి చేసుకున్నా, ఇబ్బం దులు పడకుండా ఉండేలా వీకెండ్ మ్యారేజెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరూ అందరిలాగానే పెళ్లి చేసుకుంటారు. అయితే ఇద్దరూ వారంతంలో మాత్రమే కలిసి ఉంటారు. మిగతా రోజుల్లో ఎవరి జీవితం వారు స్వేచ్ఛగా గడుపుతారు. ఈ పద్ధతిలో ఎవరి ఉద్యోగం, ఎవరి ఖర్చులు వారివే. వారాంతంలో మాత్రం కలిసి ఖర్చులు పంచుకుని ఎంజాయ్ చేస్తారు. పిల్లలు పుడితే ఖర్చులు సగం సగం పెట్టుకుంటారు. వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే కలిసి ఉంటారు కాబట్టి, విభేదాలు, గొడవలు ఉండవనే భావనతో ఈ పద్ధతి వైపు వెళ్తున్నారు. ప్రస్తుతం ఈ సంప్రదాయం హైదరాబాద్‌లో ఈ మధ్యనే మొదలైంది.

కష్టతరంగా మార్చేశారు..



గతంలో సులువుగా ఉండే పెళ్లి ప్రక్రియను నేటి తల్లిదండ్రులు, యువత క్లిష్టతరం చేశారు. ఆధునిక జీవనశైలి, వ్యక్తిగత అభి రుచులు, భిన్నమైన ఆర్థిక స్థితిగ తులు, కుటుంబాల ఆశలు ఇవన్నీ కలిసి వచ్చి పెళ్లి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వారు ఏ రంగంలో స్థిరపడినా ఆలస్యం చేయకుండా పెళ్లి చేస్తే ఎలాంటి సమస్యలు రావు. తల్లిదండ్రులు, పెద్దలు కలిసి వధూవరులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి.

- మాధవ స్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు.



● అమ్మాయిలు కొరత అత్యధికం..



అన్ని సామాజికవర్గాల్లో అమ్మాయిల కొరత అత్యధికంగా ఉంది. సంబంధాలు దొరకడం కష్టమవుతున్నది. మా మ్యా రేజ్ బ్యూరో తరఫున అనేకసార్లు వివా హ పరిచయ వేదికలు ఏర్పా టు చేసినా 112 మంది అబ్బాయిలు, 26 మంది అ మ్మాయిలు మాత్రమే తమ పేర్లు నమోదు చేసుకున్నారు. భవిష్యత్‌ను తలుచుకుంటేనే భయం వేస్తోంది.

- ఎమ్ వరలక్ష్మి, వరలక్ష్మీ మ్యారేజ్ బ్యూరో, పాతగుంటూరు.

అంబేద్కర్ జయంతి వేడుకలకు పొన్నెకల్లు సిద్ధం



● నేడు పాల్గొననున్న సీఎం చంద్రబాబునాయుడు



సభా ప్రాంగణంలో స్టేజి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ



జిల్లా ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలకు తాడికొండ మండలంలోని పొన్నెకల్లు సిద్ధమైంది. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు రానున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదివారం ఉదయం నుంచి పొన్నెకల్లులోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సీఎం పర్యటన ఇలా

సీఎం చంద్రబాబు ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి లోని ఇంటి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10:40 గంట లకు పొన్నెకల్లు చేరుకుంటారు. 10.40 నుంచి 11:05 నిమిషాల వరకు ప్రజలు, అధికారులతో మాట్లాడతారు. 11:05 నుంచి 11:10 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారు. 11:10 నుంచి 11:50 గంటల వరకు పొన్నెకల్లులోని అంబే ద్కర్ కాలనీలోని ఇళ్లను సందర్శిస్తారు. అనంతరం 12.05 గంటలకు ప్రజావేదిక సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 12:05 నుంచి 2:05 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనం తరం 2.30 గంటల వరకు భోజన విరా మం తీసుకుంటారు. 2.40 నుంచి 4.10 గంటల వరకు పార్టీ క్యాడర్‌తో సమా వేశం అవుతారు. 4:20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా ఉండవల్లిలోని ఇంటికి వెళతారు.

500 కుటుంబాలు టీడీపీలో చేరిక

◆ పార్టీ కండువాలు కప్పి స్వాగతించిన ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన దేశాయిపేట వాసులు

దేశాయిపేట(చీరాల), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వేట పాలెం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన సుమారు 500 కుటుంబాలు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారం దరినీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి స్వాగతిం చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజలు మంత్రముగ్ధులవుతు న్నారని ఎమ్మెల్యే అన్నారు. చల్లా రామయ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్ర మంలో టీడీపీ నియోజకవర్గ అధికారి ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మ న్ కౌతవరపు జనార్దనరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అన్నదాతకు.. అకాల కష్టం



కోటపాడులో ఆరబోసిన మొక్కజొన్నపై కప్పిన పట్టలపై వర్షపు నీరు

- జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షం
- కల్లాల్లోనే మొక్కజొన్న, వైట్‌బర్లీ పొగాకు... మామిడి రైతులకు నష్టమే
- కోతదశలో రబీ వరి.. పంటను కాపాడుకునేందుకు రైతుల తంటాలు
- బాపట్ల పట్టణంలో పిడుగు... భారీ గాలులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఆదివారం కురిసిన అకాల వర్షాలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. మధ్యాహ్నం వరకు భగభగలాడిన సూర్యుడు సాయంత్రానికి ఆకాశం మేఘావృతం కావడంతో పాటు భారీగా ఈదురుగాలులు, మెరుపులు, పిడుగులతో పాటు వర్షం పడడంతో పంటను కాపాడుకో వడానికి అన్నదాతలు ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్టూరులో వ డగళ్ల వాన కురవగా, బాపట్ల పట్టణంలో ఈదు రుగాలులతో కూడిన వర్షం పడింది. గాలుల ధాటికి బాపట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనానికి రక్షణగా వేసిన ఇనుప కంచె కూలిపోయింది. ఆ సమయానికి సమీపప్రాంతలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. పట్టణంలోని భీమావారిపాలెంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమా పక సిబ్బంది స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. గా లులు ధాటికి పట్టణంలో దాదాపు రెండు గంటల పాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అకాల వర్షం ధాటికి కల్లాల్లో ఉన్న పంటను కాపాడుకోవడానికి రైతాంగం తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది

రైతుల్లో తీవ్ర ఆందోళన....

కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, బాపట్ల మండలాల పరిధిలో వేల ఎకరా ల్లో వైట్ బర్లీ పొగాకు ఆరబెట్టి ఉంది. అకాల వర్షంతో పొలాల్లో పందిళ్లకు కట్టి ఉంచిన పొగాకును కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు. రబీ వరి పంట కోత దశలో ఉంది. ఈదురుగాలులు వీయడంతో పైరు నేల వాలి ధాన్యం రంగుమారే అవకాశం ఉందని అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంట నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. చాలా వరకు దిగుబడులు కల్లాల్లోనే ఉన్నాయి. మొక్కజొన్న తడిస్తే రంగు మారడంతో పాటు మొలకలు వచ్చే ప్రమాదం కూడా ఉందనేది రైతుల ఆవేదనగా ఉంది. ఇప్పటికే మద్దతుధర అందక విలవిలలాడుతున్నామని ఇప్పుడు ఈ అకాల వర్షాల దెబ్బకి బహిరంగ మార్కెట్‌లో ధర మరింత తగ్గించి అ డ ు గ ు తా ర ని రైతాంగం వాపోతోంది. మామిడి రైతులకు కూడా ఈ వర్షం ఆవేదననే మిగిల్చింది. ఈదురుగాలుల ధాటికి మామిడికాయలు రాలడంతో తమకు నష్టాల తప్ప వని మామిడి రైతులు అంటున్నారు. వేరుశ నగ, మినుము, ఉద్యా న పంటలు దాదాపు అన్ని పైర్లపై ఈ అకాల వర్షం ప్రభావం చూపింది. పర్చూరు, ఇంకొల్లు మండలాల పరిధిలో కల్లాల్లో ఆరబోసిన మిర్చిని తరలించడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు



వైట్‌బర్లీ పొగాకును కాపాడుకునేందుకు పర్చూరు రైతుల అవస్థలు



బాపట్ల: భీమవారిపాలెంలో పిడుగుపడి దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

ఈదురుగాలుల బీభత్సం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి దాదాపు మూడుగంటల పాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ధాటికి బాపట్ల రూరల్ ప్రాంతాలలో వృక్షాలు నేలకొరగగా పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మార్టూరు ప్రాంతంలో వడగండ్లు పడగా ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మరో వైపు లక్షల పెట్టుబడితో సాగు చేసినన పంట చేతికొచ్చే సమయానికి వర్షం వచ్చి నేలపాలు చేసిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెండి పట్టీలతో ప్రయోజనాలెన్నో...!

పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం అనేది ఒక సంప్రదాయంగా వస్తోంది. ఆడపిల్లలు, యువతులు, మధ్యవయసు మహిళలు తమ పాదాల అలంకరణలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తూ ఉంటారు. కేవలం అందానికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా ఈ వెండి పట్టీలు దోహదం చేస్తాయి. ఆ వివరాలు తెలుసుకుందాం....



- పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. పాదాల నొప్పి, వాపులు తగ్గుతాయి. ఎముకలు బలపడతాయి. మోకాళ్ల నొప్పి, నడుం నొప్పి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.
- వెండిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. అందుకే వెండి పట్టీలు పెట్టుకుంటే పాదాలకు ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావు.
- వెండి శీతల లోహం. నిత్యం వెండి పట్టీలు పెట్టుకుని ఉండడం వల్ల మహిళల్లో శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. శరీరానికి చలువదనం చేకూరుతుంది. వేసవిలో పాదాలు వేడెక్కడం, అరికాళ్లలో చెమటలు పట్టడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- వెండి.. శరీరంలోని విద్యుత్ చలన శక్తిని సమన్వయం చేస్తుంది. అందుకే మహిళలు తమ పాదాలకు వెండి గొలుసులు, పట్టీలు పెట్టుకోవడం వల్ల నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. దీనివల్ల శరీరంలోని హార్మోన్లు సమతౌల్యంలో పనిచేస్తాయి. రుతు సమస్యలు, మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- రంగురంగుల రాళ్లు, మువ్వలతో విభిన్న ఆకృతుల్లో రూపొందించిన పట్టీలు పెట్టుకోవడం వల్ల మహిళలకు మానసిక ఆనందం కలుగుతుంది.
- అధిక బరువున్న పట్టీలు కాకుండా తేలికగా ఉన్నవాటిని ధరిస్తే నడవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. నాణ్యమైన వెండితో రూపొందించిన పట్టీలు ఎంచుకోవడం మంచిది.



అందం అంటే అంతకుమించి

మిస్ వరల్డ్ సంస్థ సీఈఓ 85 ఏళ్ల జూలియా మోర్లీని చూస్తే 60 ఏళ్లు అనిపిస్తుంది. ఈ ప్రపంచానికి ఏదో చేయాలనే తపన అనుక్షణం కనిపిస్తూ ఉంటుంది. "అందం అనేది బాహ్యశరీరంలో మాత్రమే ఉండదు.. వ్యక్తిత్వంలో కూడా ఉంటుంది.. ఈ రెండూ కలిసినదే అసలైన అందం" అంటారు జూలియా. కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ) సహా అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన జూలియాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం ఉంది. వచ్చే నెల ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలు తెలంగాణలో నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవటానికి కారణమేమిటి?

ప్రపంచ సుందరి పోటీలను ప్రతి ఏడాది వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తూ ఉంటాం. ఈ సారి తెలంగాణను ఎంపిక చేశాం. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. నేను ఇక్కడ ఎవరికీ చెప్పని ఒక విషయం చెబుతాను. నాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం. ఎందుకంటే సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను, ఎరిక్ (జూలియా భర్త) భారత్‌కు వచ్చి అనేక ప్రాంతాలు తిరిగాం. ఆ సమయంలో మేము మహిళలకు శానిటరీ నేప్‌కిన్స్ ఇచ్చే ఒక కార్యక్రమాన్ని నిర్వహించేవాళ్లం. ఆ సమయంలో హైదరాబాద్‌కు కూడా వచ్చాం. ఆ కార్యక్రమ నిర్వహణలో మాకు పోలీసులు చాలా సాయం చేశారు. అందుకే హైదరాబాద్ అనగానే పోలీసుల ఔదార్యం గుర్తుకు వస్తుంది. ఇది చాలా కాలం క్రితం జరిగి సంఘటన. కానీ నిన్న జరిగినట్లు అనిపిస్తోంది. ఈ సారి కూడా తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. వారందరికి నా ధన్యవాదాలు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో హైదరాబాద్ ప్రపంచంలో ఎక్కువ మందికి తెలియని ఒక రహస్యం. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల ఆఫీసులు ఇక్కడ ఉన్నాయి. ఇదొక అందమైన నగరం. కానీ దీని గురించి ఎక్కువ మందికి తెలియదు. ప్రపంచ సుందరి పోటీలు ఈ నగరానికి కొత్త గుర్తింపు తీసుకువస్తుందని ఆశిస్తున్నా. ఈ పోటీల తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడకు మరింతగా రావాలని కోరుకుంటున్నా.

ప్రపంచ సుందరి పోటీలు దేనికి చిహ్నంగా భావించాలి?

ఒక అందమైన అమ్మాయిని ప్రపంచ సుందరిగా ప్రకటించటం మా ఉద్దేశం కాదు. నా దృష్టిలో అందం అంటే శరీర సౌందర్యం కాదు. అందమైన మొహం.. పెదాలు.. అవయవ సౌష్టవం ఉంటే ప్రపంచ సుందరిలు కారు. వారికి అందమైన వ్యక్తిత్వం ఉండాలి. ఇతరులకు సాయం చేసే గుణం ఉండాలి. అందుకే ఈ పోటీలను నేను 'బ్యూటీ విత్ పర్పస్' అని పిలుస్తాను. ఇక్కడికి వచ్చే అందగత్తెలందరూ వారి వారి దేశాల్లో చేయదలుచుకున్న ప్రాజెక్టులను తీసుకువస్తారు. వారు ఏ ప్రాజెక్టులు చేయాలనే విషయాన్ని మేము వారికి చెప్పం. వారి ఊహాశక్తి.. కొన్ని అంశాలపై వారికి ఉన్న నిబద్ధతల ఆధారంగా వాటిని వారు ఎంపిక చేసుకుంటారు. ఇలా ప్రతి ఏడాది సుమారు 130 ప్రాజెక్టులు వస్తాయి. వీటిలో కొన్నింటిని ఎంపిక చేసి వాటికి అవసరమైన వనరులు సమకూరుస్తాం. అందుకే ప్రపంచ సుందరి పోటీలంటే భౌతికపరమైన అందం మాత్రమే కాదని చెప్పగలుగుతున్నాను.

ఈ సారి ప్రపంచ సుందరి పోటీలలో ఫార్మాట్ మార్చినట్లున్నారు కదా..

ఫార్మాట్‌లో మార్పులు జరుపుతూనే ఉంటాం. ఉదాహరణకు ఒకప్పుడు స్విమ్‌సూట్ రౌండ్ ఉండేది. అది ఇప్పుడు లేదు. బీచ్‌లో ఉన్నప్పుడు స్విమ్ సూట్ వేసుకుంటాం. ప్రతి రోజు దాన్ని వేసుకొని తిరగం కదా! అంతే కాదు ...వ్యక్తిగతంగా కూడా నాకు స్విమ్‌సూట్ వేసుకొని ఇతరుల ముందుకు నడుచుకుంటూ రావటం ఇష్టం ఉండదు. కానీ కొన్ని పరిస్థితులకు తగ్గట్టుగా ఆ రౌండ్ ఉండేది. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి. మేము 1953లో ప్రపంచ సుందరి పోటీలను ప్రారంభించినప్పుడు పరిస్థితులు వేరుగా ఉండేవి. ప్రపంచమంతా రెండో ప్రపంచయుద్ధ ఒత్తిడి నుంచి తేరుకుంటోంది. ఈ సమయంలో ప్రజలందరిలోను ఒక విధమైన నిరాశ, ఆందోళన ఉండేవి. ఆ సమయంలో వారిలో సంతోషం నింపటానికి ఏదైనా చేస్తే బావుండననిపించింది. ప్రపంచసుందరి పోటీలు అలా పుట్టాయి. దీనిని ప్రపంచ ప్రజలందరూ ఆదరించారు. పరిస్థితులకు అనుగుణంగా మేము ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూనే ఉంటాం.

ప్రపంచ సుందరి పోటీల ద్వారా వచ్చిన సంపాదనను ఏం చేస్తారు? ఎలా ఖర్చు పెడతారు?

మాకు ఈ పోటీల నుంచి వచ్చే డబ్బులో ఒక్క రూపాయి కూడా అవసరం లేదు. డబు సంపాదించటం పట్ల నాకు ఎటువంటి ఆసక్తి లేదు. వచ్చిన డబ్బు మొత్తం మేము నిర్వహించే ప్రాజెక్టులపైనే ఖర్చు పెడతాం. ఈ ప్రాజెక్టులు విజయవంతమయినప్పుడు కలిగే ఆనందానికి వెల లేదు. ఉదాహరణకు మేము ఇండోనేషియాలో ఒక ప్రాంతంలో ఒక వంతెన నిర్మించాం. దాని వల్ల కొన్ని వందల మందికి లబ్ధి చేకూరుతోంది. అక్కడున్న పిల్లలు స్కూలుకు వెళ్లగలుగుతున్నారు. ఆ పిల్లలను కలిసినప్పుడు వారు చూపించిన ప్రేమ అమూల్యమైనది. అంతేకాకుండా- ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వేల మంది వలంటీర్లు తమ పరిధిలో సమాజంలో మార్పు తేవటానికి చేస్తున్న ప్రయత్నాలను డబ్బులతో వెలకట్టలేం.

మీరు ఇన్నేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారు కదా.. మరచిపోలేని సంఘటనలు ఏవైనా ఉన్నాయా?

చాలా ఉన్నాయి. కానీ ఒక సంఘటన మాత్రం ఎప్పుడూ మర్చిపోలేను. మేము నైజీరియాలో పోటీలను నిర్వహించాలనుకున్నాం. అక్కడి ప్రభుత్వం కూడా చాలా సాయం చేసింది. పోటీల సమయంలోనే అమీనా అనే అమ్మాయిని రాళ్లతో కొట్టి చంపారని ఒక అంతర్జాతీయ పత్రికలో వార్త వచ్చింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనం చెలరేగింది. వాస్తవానికి ఆ సంఘటన జరగలేదు. కొందరు పాశ్చాత్య జర్నలిస్టులు కావాలని రాసిన వార్త. ఆ విషయం మాకు తెలుసు. కానీ ప్రపంచానికి తెలియదు కదా! ప్రపంచమంతా అలజడి ప్రారంభమయింది. దీనితో రాత్రికి రాత్రి పోటీలను రద్దు చేసుకున్నాం. ఒక విమానాన్ని అద్దెకు తీసుకొని పోటీదారులందరితో ఇంగ్లాండ్ వచ్చేశాం. రాత్రికి రాత్రి వందల మందిని ఒక దేశం నుంచి మరొక దేశానికి తీసుకురావాలంటే ఎంత ఒత్తిడి ఉంటుందో ఆలోచించండి! ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం.

ఈ పోటీలలో పేద.. ధనిక దేశాల నుంచి వచ్చిన యువతులు ఉంటారు. వారిలో కొందరికి విపరీతంగా ఖర్చు పెట్టే స్తోమత లేకపోవచ్చు. అలాంటప్పుడు అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు..

ప్రతి దేశంలోను మిస్‌వరల్డ్ తొలి రౌండ్ పోటీలను నిర్వహించటానికి కొందరు లైసెన్స్ హోల్డర్స్ ఉంటారు. వారు వారి దేశాలలో నెగ్గిన వారికి స్పాన్సరర్స్‌ను తీసుకువస్తారు. ఒకప్పుడు దుస్తుల మీద ఎక్కువ ఖర్చు పెట్టేవారు కాదు. ఇప్పుడు ఆ ఖర్చు విపరీతంగా ఉంటోంది. అందుకే నేను జ్యూరీ సభ్యులకు "మీరు ఎవ్వరి ఒత్తిడికి లొంగవద్దు. ఇతరులు ఏం చేస్తున్నారే విషయాన్ని చూడద్దు. మీరు స్వయంగా నిర్ణయాలు తీసుకోండి.." అని చెబుతూ ఉంటా. "ఒక అమ్మాయి అద్భుతమైన డ్రస్సు వేసుకుంటే ప్రపంచ సుందరి అయిపోతుందా? ఇంకో అమ్మాయి ఇతరుల కన్నా బాగా మాట్లాడగలిగితే ప్రపంచ సుందరి అయిపోతుందా?" అని అడిగితే "కాదు" అని కచ్చితంగా చెప్పగలను.

- అందం అనేది చాలా చిత్రమైన పదం. ఒక అమాయకమైన పాప మొహంలో కనిపించే అందం కొందరు మాత్రమే చూడగలుగుతారు. చాలా సార్లు అందం అనే పదాన్ని తప్పుగా వాడుతూ ఉంటారు. నా ఉద్దేశంలో ప్రేమ, నిబద్ధత, ఇతరులకు సేవ చేయాలనే కోరిక, మంచి వ్యక్తిత్వం, చురుకుదనం- ఇవన్నీ కలగసినప్పుడే నిజమైన అందం కనిపిస్తుంది.
- మొత్తం ప్రపంచమంతా ఒకరితో మరొకరు ఎటువంటి అమరికలు లేకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు పంచుకోగలిగిన రోజు రావాలనేది నా కోరిక. అన్ని చోట్ల భిన్నాభిప్రాయాలు ఉంటాయి. రకరకాల ప్రతికూల భావాలు కూడా ఉంటాయి. వాటన్నింటినీ అధిగమించగలిగినప్పుడు అందమైన ప్రపంచాన్ని సృష్టించుకోగలుగుతాం.
- ఈ సారి పోటీల తర్వాత తెలంగాణకు ఏదో విషయంలో మేలు చేయాలనేది మా ఉద్దేశం. ముఖ్యంగా పిల్లలకు, మహిళలకు సంబంధించిన ప్రాజెక్టులను ఎంపిక చేసుకుంటాం.

• సివిఎల్ఎన్. ప్రసాద్



కోట్ల రూపాయలు వదులుకున్నా

సమంత



మహిళా సాధికారతపై తరచూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మహిళలను చైతన్య పరుస్తున్నారు నటి సమంత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మానసిక ఆరోగ్యం, వ్యాపార సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడం గురించి మాట్లాడారు. కోట్ల రూపాయల డబ్బు వస్తున్నప్పటికీ వాటిని పక్కన బెట్టడం వెనుక బలమైన కారణం ఉందన్నారు. '20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చాను. అప్పట్లో ఎన్ని సినిమాలు చేశాం. ఎన్ని బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్నాం అనేదానిపైనే సక్సెస్‌ని నిర్ణయించేవారు. నిజానికి ఆ సమయంలో ఎన్నో బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ ఇప్పుడు నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు పెద్దగా ఆలోచించకుండా కొన్ని బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. కోట్ల రూపాయలు చెల్లించేందుకు సిద్ధపడినా ఏడాది కాలంలో 15 బ్రాండ్లు వదులుకున్నా. ఇప్పటికీ చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ నేను అంగీకరించడం లేదు. నాకు తెలిసిన వైద్యులను సంప్రదించి సదరు బ్రాండ్లతో ఎలాంటి హానీ లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత తెలిపారు.

వినోదం పంచే పాంచ్‌మినార్



రాజ్‌తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'దర్శకుడు గొప్ప విజన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పాడు. రామ్ కడుముల మాట్లాడుతూ 'పాంచ్‌మినార్ అంటే ఏమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఆద్యంతం హాయిగా నవ్వుకునే సినిమా ఇది' అని తెలిపారు. 'ఇందులో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది, ప్రేక్షకులను అలరిస్తుంది' అని కథానాయిక రాశీ సింగ్ చెప్పారు.



పెద్ద విజయం అందుకోబోతున్నాం

'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో చక్కని ఆదరణ దక్కుతోంది. అన్ని చోట్లా సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇది ఇక్కడితో ఆగదు. సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతోంది' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ 'మైత్రీ సంస్థ తమిళంలో చేసిన తొలి చిత్రమిది. నవీన్ గారి వల్లే సినిమా ఇంత పెద్దహిట్ అయింది. అజిత్ గారి మద్దతు మరువలేనిది' అని చెప్పారు. అజిత్‌ఫ్యాన్స్ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారని సునీల్ చెప్పారు. ఈ సినిమాలో నా పాత్రకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది అని ప్రియా ప్రకాశ్ వారియర్ తెలిపారు.

మంచి కథను అందించాలనే..

సుమయ రెడ్డి

'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే ఆసక్తి. ఇంట్లో ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలే చూసేవాళ్లం. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మోడలింగ్ చేశా. సినిమాల్లో నటించాలనేది నా చిరకాల కోరిక. అందుకని చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాను' అని అన్నారు సుమయ రెడ్డి. ఆమె నిర్మిస్తూ కథానాయికగా నటించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'ఓ మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో 'డియర్ ఉమ' కథ రాశాను. దర్శకుడు సాయి రాజేశ్ మహదేవ్ గారితో నాకు ఎన్నో ఏళ్ల పరిచయం ఉంది. అర్థవంతమైన కథ అందరికీ పనికొస్తుంది అన్నారు. నన్ను నమ్మి డబ్బులు పెట్టి సినిమా తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు అనే సంశయంలో పడిపోయా. అప్పుడు మా అమ్మ సపోర్ట్‌తో నేనే నిర్మాతగా సినిమా తీయాలని నిర్ణయించుకున్నా. నేడు కార్పోరేట్ ఆస్పత్రుల్లో చోటు చేసుకుంటున్న సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. సొసైటీకి మెసేజ్ ఇవ్వడమే కాదు పరిష్కారాన్నీ చూపించే ప్రయత్నం చేశాం. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఈ సినిమాలో మంచి లవ్ ట్రాక్ కూడా ఉంది. హీరో, హీరోయిన్లు ఒకరి లక్ష్య సాధనకు మరొకరు ఎలా సాయపడ్డారనే అంశాన్ని అద్భుతంగా తెరకెక్కించాం. వీరిద్దరూ కలసి వైద్య వ్యవస్థ ప్రక్షాళనకు ఎలా పోరాడారన్నది ప్రధాన ఇతివృత్తం. ఒక తెలుగమ్మాయిగా నా సినిమాలో తెలుగు హీరోనే పెట్టాలనుకున్నాను. కొంతమందిని సంప్రదించాను కానీ డేట్స్ కుదరలేదు. అందుకని హీరోగా పృథ్వీ అంబర్‌ను ఎంచుకున్నాం' అని అన్నారు.



భావోద్వేగానికి గురైన మంచు లక్ష్మి



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించే లక్ష్యంతో నటి మంచు లక్ష్మి 'టీచ్ ఫర్ ఛేంజ్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతీ ఏడాదీ హైదరాబాద్‌లో సెలబ్రిటీ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నారు. తాజాగా, నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మంచు మనోజ్, తన సతీమణి మౌనికతో విచ్చేసి మంచు లక్ష్మిని ఆశ్చర్యపరిచారు. చాలా రోజుల తర్వాత తన తమ్ముడిని చూసిన ఆనందంలో ఆమె, భావోద్వేగంతో మనోజ్‌ను హత్తుకున్నారు. కంటనీరు పెట్టుకున్న మంచు లక్ష్మిని మౌనిక ఓదార్చారు.

జీసస్ ప్రాణత్యాగంతోనే మానవులకు రక్షణ

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య

ఫిరంగిపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : జీసస్ ప్రాణ త్యాగం వలనే మానవులకు రక్షణ మార్గం ఏర్పడిందని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. ఆదివారం మాని కొమ్మల పండుగ సందర్భంగా ఫిరంగిపురంలోని బాల ఏసు చర్చిలో సమిష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. మానవుల పాప



దివ్య పూజాబలిలో మాట్లాడుతున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

పరిహారార్థం దేవుని ప్రణాళికతోనే జీసెస్ సామాన్యునిగా జన్మించి ఆదర్శ వంతమైన జీవితాన్ని గడిపి ప్రజలను ఆధ్యాత్మికత వైపు నడిపించారన్నారు. మానవులు క్షమా సమాధానాలు కలిగి ఉండాలని ఆయన బోధించారన్నారు. ఈస్టర్ పండుగకు క్రైస్తవులంతా సిద్ధ పడాలని ఆయన కోరారు. ఈ వారం పవిత్ర వారమని, క్రీస్తు శ్రమల గురించి ఎక్కువగా ధ్యానించాలని భక్తులకు ఆయన బోధించారు. ముందుగా మాని కొమ్మలను బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య ఆశీర్వదించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం మాని కొమ్మలు చేబూని పురవీధుల్లో ప్రదర్శన జరిపారు. దివ్య పూజా బలిలో చర్చి ఫాదర్ ఎం పాతిమా మర్రెడ్డి, ఫాదర్లు ప్రవీణ్, రవీంద్ర, విలియం, భరత్‌రెడ్డి, గుడి పెద్దలు, కన్యస్త్రీలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వమే అంబేడ్కర్ ఆశయం

- మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమానత్వం సాధించటానికి అంబేద్కర్ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం కావాలని, ఆయన బాటలోనే ముందుకు నడవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాతగా దేశానికి దిశా నిర్దేశం చూపారన్నారు. న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన రాణించారని, ఆయన బాటలోనే భావితరాలు నడిస్తే ఆయన ఆశయాలను నెరవేర్చినవారవుతారన్నారు. ఆ మహనీయుడిని స్మరించుకుంటూ రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడూ తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఫెయిల్.. మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య



ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

చెరుకుపల్లి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యినందుకు మనస్థాపానికి గురైన మున్నం ప్రశాంత్‌రెడ్డి (18) ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి తల్లిదండ్రులు, ఒక సోదరుడు ఉన్నారు. ఇరుగుపొరుగువారు అతనిని చెరుకుపల్లిలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

దేశానికే ఆదర్శంగా వంద పడకల ఆస్పత్రి

● మంత్రి నారా లోకేశ్ ● మంగళగిరిలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆస్పత్రి మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల నాటి కల. ఆ కలను నెరవేర్చే అవకాశం ఇప్పుడు దక్కింది. భారతదేశానికే ఆదర్శంగా నిలిచేలా మంగళ గిరిలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని తీర్చిదిద్దుతాం. ఆస్పత్రి నిర్మాణ పనులను ఏడాదిలోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి మంత్రి లోకేశ్ ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య కూటమి నేతలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 1984లో స్వర్గీయ ఎన్టీఆర్ యార్లగడ్డ వెంకన్న చౌదరి కేన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద మంత్రి లోకేశ్ సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '1984లో ఎన్టీఆర్ మంగళగిరిలో 30 పడకల ఆస్పత్రి, చినకాకాని వద్ద కేన్సర్ ఆస్పత్రి కోసం శంకుస్థాపన చేశారు. మంగళగిరిలో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల ద్వారా లక్షలాది మందికి వైద్యం అందించడం జరిగింది. 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని కొన్ని సంవత్సరాలుగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నన్ను కలిశారు. ఇప్పుడున్న స్థలంలో కాకుండా మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సువిశాల ప్రాంగణం వుండాలనే ఆలోచనతో చినకాకాని కేన్సర్ ఆస్పత్రి స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందని' వివరించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణంపై అనేకమార్లు సమీక్షించి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాతే భవన నమూనాలను ఖరారు చేయడం జరిగిందన్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు ధీటుగా వంద పడకల ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని, ఆర్థో, డయాలసిస్ సెంటర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామని, తలసేమియా, డీఎడిక్షన్ సెంటర్లను



ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్, చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే మంగళగిరిని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. తొలుత వంద పడకల ఆస్పత్రి సాధనా కమిటీ ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతబూని మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీపీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మాజేటి వంశీకృష్ణ, కేవీఎస్ సాయిప్రసాద్, మాగంటి ప్రసాద్, రాజు నాయుడు, శ్రావణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని పరిరక్షించుకుందాం

● ప్రముఖ సినీ నటుడు మాగంటి మురళీమోహన్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సజీవ కళైన నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ నటుడు డాక్టర్ మాగంటి మురళీ మోహన్ అన్నారు. గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, డాక్టర్ మురళీమోహన్ 52 సంవత్సరాల కళా రంగ ప్రస్థానం, వైకే నాగేశ్వరరావు సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు, ఎల్వీఆర్ క్లబ్‌లో జరిగే డాక్టర్ మాగంటి మురళీమోహన్ నాటకోత్సవాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఎఫైర్స్ సలహాదారులు మహమద్ షరీఫ్, ఎల్వీఆర్ క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ నాటక రంగాన్ని బతికించుకుంటేనే సినీ, టీవీ రంగాలు బతికుంటాయన్నారు. సీనియర్ నాటక రంగ కళాకారులకు పెన్షన్ ఇతర ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. ఎల్వీఆర్ క్లబ్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఎల్వీఆర్ క్లబ్‌లో కొన్ని కార్యకలాపాలకు అనుమతి రద్దు చేసిందని తిరిగి వాటిని పునరుద్ధరించాలని కోరారు. గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కళాకారులకు కళారత్న, హంస పురస్కారాలు అందజేసిందని గుర్తు చేశారు. మంచిని ప్రచారం చేయకపోతే చెడు రాజ్యమేలుతుందని.. అందుకే ప్రతి ఒక్కరూ చంద్రబాబు చేస్తున్న మంచి పనులను ప్రచారం చేయాలని కోరారు. ఈనెల 20న ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన గురించి మంచి సందేశాలను పంపితే వాటిని సామాజిక వేదికల్లో ప్రదర్శిస్తామని అన్నారు. మహమద్ అహమద్ షరీఫ్ మాట్లాడుతూ కళాకారుడు పెట్టిన పార్టీలో ఏ కళాకారులకు అన్యాయం



ఆత్మీయ సత్కారం పొందిన గుమ్మడి గోపాలకృష్ణ, మహమద్ షరీఫ్‌లతో మురళీమోహన్, ఆలపాటి రాజేంద్రప్రసాదు, గల్లా మాధవి, నసీర్ అహ్మద్ తదితరులు

జరగదని అన్నారు. కళాకారులకి పెన్షన్‌తో పాటు ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేలా నాటక అకాడమీ కార్యచరణ రూపొందించాలని కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేద కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ నాటక రంగాన్ని ప్రోత్సహిస్తున్న మురళీమోహన్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, మహమద్ షరీఫ్‌లకు మురళీమోహన్ చేతుల మీదగా ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో నాటకోత్సవ కమిటీ చైర్మన్ ఘంటా పున్నారావు, కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు, యాగంటి దుర్గారావు, పెమ్మసాని రవికుమార్, సినీ నిర్మాత నన్నపనేని సుధాకర్, పారిశ్రామికవేత్తలు కళ్ళం మోహన్ రెడ్డి, అంబటి మోహన్, సామినేని కోటేశ్వరరావు, క్లబ్ సభ్యులు వణుగూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ. 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షల చెక్కును డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య అందజేశారు. ఆదివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజనసేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వ రరావుకు డాక్టర్ కొండబోలు వరప్రసాదుతో కలిసి ఆయన ఈ చెక్కును అందజేశారు. అనంతరం కొండబోలు బసవపున్నయ్య మాట్లాడుతూ గ్రామీణ బాలికల విద్యకు కృషి చేస్తున్న కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ 1992-2000 కాలంలో సమితి అధ్యక్షుడుగా డాక్టర్ కొండబోలు బవసపున్నయ్య వ్యవహరిం చారని, తిరిగి ఇప్పుడు అదే సమితికి ఆయన విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు.



సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య

సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న సహాయ సహకారులు గొప్పవని అన్నారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షుడు వంకాయల పాటి బలరామకృష్ణయ్య, సభ్యులు వడ్లమూడి నాగేంద్రం. గుంటుపల్లి కోటేశ్వరరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో కలకలం

● ఎస్కార్ట్ విధుల్లో నిర్లక్ష్యానికి భారీ మూల్యం ● సీఐ సహా 12 మంది సస్పెన్షన్‌తో ఉలిక్కిపడిన పోలీసు వర్గాలు ● ఉన్నతాధికారుల సీరియస్

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌శాఖలో 12 మందిపై ఒకేసారి వేటుపడిన ఉదంతం ఆ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ఓ డీఎస్పీని వీఆర్‌కు పంపగా, ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 8 మంది పోలీస్ సిబ్బందిపై వేటు వేయడం పోలీస్, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా నాడు రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ నుంచి నేడు వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వరకు పోలీసుల ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించడానికి కారణం ఎవరు..? అనే ప్రశ్నలు సర్వత్ర ఉత్పన్నమవుతున్నాయి. పోలీస్ కస్టడీలో ఉన్న సమయంలో బోరుగడ్డకు పోలీస్ స్టేషన్‌లోనే రాచ మర్యాదలు జరగడం, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్‌శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. దీంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ ఘటనకు బాధ్యులుగా భావించిన నాటి వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్‌ను బదిలీ చేయగా, నాటి సీఐ కొంక శ్రీనివాసరావును వీఆర్‌కు పంపారు. నలుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. తుళ్లూరుకు సంబంధించిన ఓ కేసులో రౌడీ షీటర్ బోరుగడ్డ అనిల్‌ను పోలీస్ కస్టడీకి తీసుకున్న అనంతరం రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలిస్తున్న తరుణంలో గన్నవరంలో ఆయనను రెస్టారెంట్‌కు తీసుకు వెళ్లడంతో.. ఈ ఘటనలోనూ పోలీసుల నిర్లక్ష్యాన్ని గుర్తించినందుకు అధికారులు ఆరుగురుపై సస్పెన్షన్ విధించారు. దీంతో బోరుగడ్డ వ్యవహారంలో ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి గాను సుమారు 12 మంది ఇబ్బంది పడ్డారు. మాజీ ఎంపీ, వైసీపీ నేత గోరంట్ల మాధవ్ వ్యవహారం మరోసారి పోలీస్ ప్రతిష్ఠ దెబ్బతినడానికి దారి తీసింది. గోరంట్ల మాధవ్ విషయంలో పోలీస్ ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించలేకపోయారనే అపవాదు మూట కట్టుకున్నారు.

చేబ్రోలు కిరణ్ విషయంలోనూ పోలీసుల అత్యుత్సాహం

టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ విషయంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అతిగా స్పందించారనే వాదన కూడా వచ్చింది. సాధారణంగా సోషల్ మీడియాలో పోస్టులకు సంబంధించిన కేసులో నిందితులను అదుపులోకి తీసుకొని సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి 41ఏ నోటీసు జారీ చేయడమో లేదంటే కోర్టులో హాజరు పరచడమో చేయాలి. ఆయనను ఇబ్రహీంపట్నం శివారులో అదుపులోకి తీసుకున్న తర్వాత మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి అక్కడ అరెస్టు చేయడమో.. లేదంటే నోటీసు జారీ చేసి పంపాల్సి ఉంది. ఆయనను ఏకంగా గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకు వచ్చి మీడియా ఎదుట హాజరు పరచడాన్ని పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కిరణ్‌ను అకారణంగా గుంటూరులో మీడియా సమావేశానికి తీసుకురావడం వల్లే గోరంట్ల మాధవ్ వ్యవహారం చోటు చేసుకోవడం, అది రచ్చగా మారడం జరిగింది. కిరణ్‌ను గుంటూరులో మీడియా ఎదుట హాజరు పరిచిన నేపథ్యంలో అదే కేసులో పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పైనా, పోలీసులపైనా దాడి, అందులోనూ ఎస్పీ కార్యాలయంలోనూ పోలీసులపై దాడికి పాల్పడడాన్ని సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారులు మాధవ్‌ను కూడా మీడియా ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. గోరంట్ల మాధవ్ మీడియా ముందుకు రావడానికి నిరాకరించి పోలీసులపై విరుచుకుపడడంతో ఆయనను మీడియా ముందు హాజరు పరచలేకపోయారు. కిరణ్‌ను గుంటూరులో మీడియా ఎదుట హాజరు పరిస్తే హైలెట్ అవుతుందంటూ ఓ డీఎస్పీ ఎస్పీకి సూచించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. మాధవ్‌ను మాత్రం మీడియా ఎదుట హాజరు పరిచయలేకపోయారు. ఇది కూడా ఉన్నతాధికారుల ఆగ్రహానికి కారణమైందని అంటున్నారు.

సిబ్బందిలో కొరవడుతున్న అంకితభావం

పోలీస్‌శాఖలో గడిచిన కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణారహిత్యానికి అద్దం పడుతున్నాయి. తాజాగా వైసీపీ నేత గోరంట్ల మాధవ్ విషయం రచ్చకెక్కింది. మాధవ్‌ను వైద్య పరీక్షల నిమిత్తం తీసుకొచ్చినప్పుడు ఆయనకు ఎస్కార్ట్‌గా ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 8 మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఎస్కార్ట్ విధుల్లో ఉన్న సిబ్బంది ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించలేదనేది సుస్పష్టం. జీజీహెచ్‌లో ఆయన రెండు దఫాలు తన అనుచరుల నుంచి ఫోన్ తీసుకొని మాట్లాడుకునే అవకాశం కల్పించడాన్ని పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. మొదటిసారి గమనించిన కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి సైగ చేయడంతో వెంటనే అరండల్ పేట సీఐ వీరాస్వామి వెళ్లి సెల్ఫోన్ లాక్కునే ప్రయత్నం చేసి సంబంధిత ఎస్సైలు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. కనీసం ఎస్ఐలు, సిబ్బంది అప్పుడైనా బాధ్యతగా వ్యవహరించారా అంటే అదీ లేదు. మరోసారి మాధవ్ తన అనుచరుల నుంచి ఫోన్ తీసుకొని మాట్లాడటం మళ్లీ అరండల్ పేట సీఐ వీరాస్వామి గమనించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి ఎస్కార్ట్ ఇన్చార్జిగా ఉన్న సీఐ వీరాస్వామి గమనించి ఆగ్రహం వ్యక్తం చేయడం తప్ప మిగిలిన ఎస్ఐలు గాని, 8 మంది సిబ్బంది కానీ ఎస్కార్ట్ విధుల్లో ఉండి ఏం చేస్తున్నారనేది ఉన్నతాధికారుల ప్రశ్న. అసలు ఆరోజు జీజీహెచ్‌లో మాధవ్, ఆయన అనుచరులకు వైద్య పరీక్షల సందర్భంగా ఏం జరిగిందనే దానిపై ఉన్నతాధికారులు ఆసుపత్రిలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. నిఘావర్గాల నుంచి కూడా వివరాలు సేకరించారు. ఆయనకు ఎస్కార్ట్‌గా 11 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమిస్తే ఆరోజు సీసీ కెమెరాలో ఎస్కార్ట్ సిబ్బంది ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వారెవరు ఆయన పక్కన కనిపించలేదు.

గోమాతల పేరుతో వైసీపీ నీచ రాజకీయం

ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ

వినుకొండ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శవరాజకీయాలకు పెట్టింది పేరైన వైసీపీలో జగన్, భూమన చివరకు గోమాతలను కూడా వదలక పోవడం దారుణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తండ్రి శవంతో పార్టీ పెట్టి బాబాయి శవంతో అధికారంలోకి వచ్చింది మొదలు ఎక్కడ ఏ ప్రేతం దొరుకుతుందా అనే ఎంతసేపూ వారి వెదుకులాటగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. టీటీడీ గోశాలలో ఆవులు సహజ మరణాలను కూడా రాజకీయ స్వార్థం కోసం వాడుకోవాలన్న వారి తప్పుడు ప్రచారాలు కూడా అందులో భాగమేనని మండిపడ్డారు. అసలు వైకాపా, జగన్‌కు హిందూ ఆలయాలపై ఎందుకింత కక్షో అర్థం కావడం లేదన్నారు. జగన్ ఐదేళ్ల పాలన లో వందకు పైగా హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని, 2023లో లడ్డూ కల్తీతో తిరుమలను అపఖ్యాతి పాలు చేసింద ఇంకా ఎవరూ మరచి పోలేదన్నారు. ఇప్పుడు వంద ఆవులు చనిపోయాయంటున్న వారి అబద్ధాలకు టీటీడీ రికార్డులే నిజం చెబుతుయన్నారు. ఎక్కడివో ఫేక్ ఫోటోలు తెచ్చి భక్తుల్లో అలజడి రేపడమే ఈ కుట్ర లక్ష్యంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు స్వామివారి ఉనికినే ప్రశ్నించిన నాస్తికుడైన భూమనకు టీటీడీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు.

టీటీడీపై దుష్ప్రచారం తగదు : ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేయడాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఖండిం చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. అదో నల్లరాయి.....దానిమీదకు చెప్పు విసిరితే ఏమవుతుం దంటూ గతంలో వెంకటేశ్వరస్వామిపై అనేక విమర్శలు చేసిన కరుణాకరరెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపాడని యరపతినేని పేర్కొన్నారు. అలజడి సృష్టించేందుకు ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తూ కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమా తలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేం దుకు కుట్రలు చేస్తున్నాడన్నారు. గోశాలలో వంద ఆవులు చనిపోయాయంటూ కరుణాకరరెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తవమని, వృద్ధాప్యం కారణంగా కొన్నిసార్లు ఆవులు మృత్యువాత పడుతుంటాయని, దానికే అసత్య ప్రచారం చేయడం ఏమిటని మండిపడ్డారు. గో సంరక్షణశాలపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడం తో పాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా ప్రభుత్వం సమీక్షిస్తుందని ఈ సందర్భంగా యరపతినేని తెలిపారు.

తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసీపీ

- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతను వైసీపీ ప్రభుత్వ హయాంలో దెబ్బతీసి భక్తుల మనోభావాలతో ఆటలాడుకుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. ఆదివారం తెనాలిలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆలపాటి మాట్లాడుతూ టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే పార్టీ వైసీపీ మాత్రమేనని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల దేవుళ్ల పేరుతో కూడా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమల ప్రతిత్రతను కాపాడుతూ పాలన చేపట్టిందన్నారు. గో సంరక్షణకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయించిందని వివరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలు ఇకనైనా మానకుంటే ప్రజలే తిరగబడతారని ఆలపాటి హెచ్చరించారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి ఆదేశాలతో విధ్వంస రచన : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన టీటీడీని తమస్వార్థ రాజకీయాలకు బలిచేసి, ప్రశాంతమైన రాష్ట్రంలో విధ్వంస రచన చేయాలన్నదే జగన్, వైసీపీ నేతల పన్నాగమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎక్కడో చనిపోయిన గోవుల ఫొటోలతో టీటీడీని, హిందూధర్మాన్ని అన్యమతస్థుడైన భూమన కరుణాకర్ రెడ్డి బదనాం చేస్తున్నాడని, తాడేపల్లి ఆదేశాలతోనే భూమనలో ఉన్నపళంగా టీటీడీ ప్రతిష్ఠపై, గోవులపై వాత్సల్యం, ప్రేమ ఉప్పొంగాయని చెప్పారు. టీటీడీ గోశాలకు నిత్యం వచ్చే వేలాది భక్తులకు కనిపించని గోమరణాలు భూమనకే కనిపించడం జగన్మాయ కాదా అని అన్నారు. టీటీడీ గోశాలలో 100 ఆవులు చనిపోయాయనే భూమన, వైసీపీనేతల ప్రచారమంతా అసత్యమన్నారు. జగన్ పాలనలో రథాలు తగలబడ్డా, విగ్రహాలు నరికివేయబడ్డా, ఆలయాలు కూల్చబడ్డా ఆఖరికి సాదాసీదా గుడులు మొదలు, ప్రసిద్ధ క్షేత్రాల్లో నిధులు సొంతపార్టీవారే స్వాహా చేసినా తెరవని నోళ్లు నేడు మత విద్వేషాలకోసం ఆవురావురంటూ తెరుచుకోవడం స్వార్థ, విద్వేష రాజకీయ రగడం కోసం కాదా అని ఆయన ప్రశ్నించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో గో మరణాలపై భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలో భాగమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీ పై కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జియో టాగింగ్ పై, మరణాల పై తప్పుడు ప్రచారం చేయటం తగదన్నారు. గో సంరక్షణశాల పై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు గోవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటుందన్నారు. 260 మందికి పైగా ఉద్యోగులు గోవుల సంరక్షణకు పని చేస్తున్నారన్నారు.

అమరావతి రైలు మార్గానికి భూసమీకరణ స్కీమ్ అమలు చేయాలి

● మంత్రి నారాయణకు పెదకూరపాడు, తాడికొండ ఎమ్మెల్యేల విజ్ఞప్తి

గుంటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు నూతన రైలుమార్గం కోసం పెదకూరపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో చేపట్టనున్న భూసేకరణకు రాజధానిలో ఎలాగైతే ల్యాండ్ పూలింగ్ స్కీమ్ అమలు చేశారో అలానే చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇద్దరు ఎమ్మెల్యేలు తాజాగా రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పీ నారాయణని ఆయన కార్యాలయంలో కలిసి చర్చించారు. కర్లపూడి, వైకుంఠపురం, యండ్రాయి గ్రామాల్లో దాదాపుగా 800 ఎకరాల భూములు రాజధాని రైలుమార్గంలో రైతులు కోల్పోయే పరిస్థితి ఉన్నదన్నారు. ఇప్పటికే ఈ గ్రామాల ప్రజలు విద్యుత్ హెచ్‌టీ లైన్స్ కోసం రెండు, మూడుసార్లు భూ ములు ఇవ్వడం వలన చాలా కోల్పోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎవరివైతే భూములను రైలుమార్గం కోసం తీసుకొంటారో వాళ్లందరికి అమరావతి రాజధానిలో ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద నివాస, వాణిజ్య ప్లాట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఇందుకు మంత్రి నారాయణ స్పందిస్తూ తాను ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గాలులు... పిడుగుల వర్షం

- నిలిచిన విద్యుత్ సరఫరా
- బాపట్లలో ట్రాఫిక్‌కు అంతరాయం

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగుల వర్షం కురిసింది. భారీ గాలులతో కురిసిన వర్షం వల్ల ప్రజలు భయాందోళన చెందారు. పట్టణంలోని భీమావారిపాలెంలో కట్టా నాగరాజు ఇంటి సమీపంలోని యర్రం నారాయణ ఖాళీ స్థలంలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగులు పడి పెద్దఎత్తున మంటలు లేచాయి. అదేవిధంగా బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలోని కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటలు లేవటంతో ప్రిన్సిపాల్ పొన్నూరు వినీత అగ్నిమాపకాధికారులకు సమాచారం ఇవ్వటంతో అగ్నిమాపక సిబ్బంది వసంతరావు, వీరయ్య, శ్రీను, సునీల్ తదితరులు ఆయా ప్రాంతాలకు వెళ్ళి మంటలు అర్పి మరింత ప్రమాదం జరగకుండా చూశారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని నాయీబ్రాహ్మణకాలనీలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది.


అక్రమ కట్టడంకు ఏర్పాటు చేసిన ఐరన్ పరంజా గాలికి రోడ్డుపై పడిన చిత్రం

తప్పిన పెనుప్రమాదం...

పట్టణంలోని సూర్యలంకరోడ్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదురు ప్రధాన రహదారి పక్కనే నిర్మిస్తున్న బహుళాంతస్థు అక్రమ కట్టడం వద్ద ప్రమాదం జరిగింది. బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఐరన్ పరంజా గాలులకు ఒక్కసారిగా నేలకూలింది. విద్యుత్ వైర్లపై, స్తంభాలపై, ప్రధానరహదారిపై విచ్చలవిడిగా పడిపోయాయి. నిత్యం రాకపోకలలో రద్దీగా ఉండే ఈప్రాంతంలో ఆసమయంలో ప్రజలు రాకపోవటం వల్ల పెనుప్రమాదం తప్పింది. లేకుంటే పెద్దప్రమాదం సంభవించి ఉండేది. పైగా ప్రాణ నష్టం కూడా సంభవించేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీనివల్ల రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి పట్టణ ప్రజలు ఇబ్బందిపడ్డారు. సూర్యలంకరోడ్డులో రాకపోకలు స్తంభించిపోయాయి. అసలే అక్రమ కట్టడం ఆపై కోర్టులో ఛార్జ్‌షీట్ వేసినప్పటికి ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టటమేకాకుండా నాయకుల అండదండలతో అక్రమ కట్టడాన్ని కొనసాగిస్తూ ఈ విధంగా ప్రమాదానికి కారణమైన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వరి కుప్ప దగ్ధం

బాపట్లరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు రెండు ఎకరాల వరికుప్ప దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల మండలం మూలపాలెం గ్రామానికి చెందిన రేగులగడ్డ వినయ్‌కుమార్‌కు చెందిన 2 ఎకరాల వరికుప్ప ఆదివారం సాయంత్రం కురిసిన భారీవర్షానికి పిడుగుపాటు వలన పూర్తిగా కాలిపోయింది.


మూలపాలెంలో పిడుగుపాటుకు దగ్ధమవుతున్న వరికుప్ప

వేమూరు మండలంలో...

వేమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో ఆదివారం అకాల వర్షంతో పాటు ఈదురుగాలులు విస్తృతంగా వీచాయి. చేలలో కోత కోసిన కండెల రాశులు ఉన్నాయి. యంత్రాల ద్వారా కోసిన మొక్కజొన్నలు చేలలో, రోడ్ల పక్కన రాశులుగా ఆరబోశారు. వర్ష సూచనతో రాశులపై పట్టాలు కప్పారు. ఈదురు గాలులు వీచడంతో రాశులపై కప్పిన పట్టాలు ఎగిరిపోయి మొక్కజొన్నలు తడిశాయి. అక్కడక్కడ వడగండ్ల వానలు కూడా పడ్డాయి.


పట్టాలు ఎగిరిపోవడంతో తడిసిన మొక్కజొన్నలు

చుండూరు మండలంలో...

చుండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : చినపరిమి, కార్మూరువారిపాలెం, చుండూరు, ఆలపాడు, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు, దుండిపాలెం, యడ్లపల్లి పొలాల్లో అరబోసుకున్న జొన్న, మొక్కజొన్న దిగుబడులు వర్షానికి తడిసిపోయాయి. చినపరిమి డొంక, తెనాలి మార్గంలో సెల్ టవర్ కూలి 11కెవి విద్యుత్ వైర్లపై పడింది. ఈ ప్రాంతంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు గాలులకు ఒరిగిపోయాయి. చినపరిమిలో వీధులు జలమయం అయ్యాయి. పలు గ్రామాల్లో పెద్ద సైజులో వడగళ్ల పడ్డాయి. కల్లాలోను, డొంకలపై ఆరబోసుకున్న జొన్న, మొక్కజొన్న, మినుములు వర్షానికి తడిచి పోవడంతో నాణ్యత లోపం ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


జలమయమైన చినపరిమి-చినగాదెలవర్రు రోడ్డు, అంతరచిత్రంలో వడగండ్లు

కొల్లూరులో...

కొల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం రైతులను విడిచిపెట్టడం లేదు. ఆదివారం ఉదయం కొల్లూరులో ఆకాశం మేఘావృతమై చినుకులు పడ్డాయి. చిరుజల్లులతో వర్షం ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తరువాత తీక్షణంగా ఎండ వేసినప్పటికీ మళ్లీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం ఉరుములు, మెరుపులతో మళ్లీ మేఘావృతం కావడంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. పొలాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలను కాపాడుకునేందుకు ప్లాస్టిక్ పట్టాలతో భద్రపరుచుకున్నారు. కొంతమంది రైతులు నిలువు మీద ఉన్న మొక్కజొన్న పంటను యంత్రాల సాయంతో కోత కోసి నూర్పించి ట్రాక్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు.


కొల్లూరులో ఆరబోసిన మొక్కజొన్న గింజలపై పట్టాలు కప్పుకుంటున్న రైతులు

లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 32వ వార్డు హయ్యర్‌నగర్ ఫాదర్ హయ్యర్‌మెమోరియల్ లూథరన్ దేవాలయంలో సండేస్కూల్ విద్యార్థులు, సంఘస్తులు మట్టల ఆదివారం వేడుకను ఘనంగా నిర్వహించారు. సంఘస్తులు, పిల్లలు ఈతమట్టలు పట్టుకొని పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘకాపరి డాక్టర్ చింతా ఏసురత్నం, చింతా రాధారత్నం, సండేస్కూల్ డైరెక్టర్ అడే సుష్మా, పీసీసీమెంబర్స్ పెరికల రూత్‌జైశీల్‌బాబు, జోగి ఆదినారాయణ, పెద్దలు ఎం.వెంకటస్వామి, నలగల రమేష్‌బాబు, బిళ్ళా పెద్ద, అడే వంశీ, దోనేపూడి వరకుమార్, మేకల యాకోబు, పేరలి సత్యదేవకుమార్, సలగలభావన్న, హయ్యర్‌నగర్ యూత్‌కమిటీ సభ్యులు, స్త్రీలసమాజం, సండేస్కూల్ విద్యార్థులు, సంఘస్తులు పాల్గొన్నారు.


మట్టల ఆదివారం ర్యాలీ చేస్తున్న హయ్యర్‌నగర్ ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చి కాపర్లు, సంఘస్తులు, విద్యార్థులు

● పట్టణంలోని సీబీజెడ్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ ఎం.పవిత్రకుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సర్వమానవాళి పాపం నిమిత్తం బలిఅర్పణకు ముందు యెరుషలేం పట్టణంలో జయప్రవేశం చేసిన రోజును పురస్కరించుకొని మట్టలాదివారం జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ డీఎం రాహుల్‌దేవ్, కెజె.విమోచన సుభాకర్, సంఘసెక్రటరి జె.క్రిష్టాఫర్, జె.సాధుహెర్బర్ట్, టి.ప్రేమచంద్, డానీయేలు, సంఘస్తులు, స్త్రీలసమాజం, సండేస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

● పట్టణంలోని 11వవార్డు విద్యానగర్ బాపట్ల మండల రక్షణ సైన్యం చర్చి ఆధ్వర్యంలో మట్టలాదివారం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు, స్త్రీలసమాజం, సంఘపెద్దలు కలిసి నిర్వహించిన ఈ ర్యాలీలో మట్టలాదివారం విశిష్టత గురించి సంఘకాపరి వివరించారు. కార్యక్రమంలో జీఎ.మణిభూషణ్, ఎం.శామ్యూల్, ఎం.రాజీవ్‌చక్రవర్తి, బి.ఉదయభాస్కర్, బి.షమీర్‌చంద్ర, డాక్టర్ కాగిత వరప్రసాదరావు, సంఘకాపరి డి.ఏబు, డి.జ్యోతి పాల్గొన్నారు.

● పట్టణంలోని సూర్యలంకరోడ్డులో ఆనందనగర్ పునరుద్ధాన లూథరన్‌దేవాలయం సండేస్కూల్ విద్యార్థులు, యూత్ సభ్యులు మట్టలాదివారం ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సండేస్కూల్ టీచర్ కొప్పోలు అపర్ణ, అనురాధ, జోత్స్న, సుమలత, ఝాన్సీ ప్రతిభ, గ్రేసి, హాని, అనుదీప్, రవి, హర్ష, చంటి, ప్రిన్స్, సంపత్, నోయల్, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లోని క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం చిన్నారులతో కలిసి రంగురంగుల పుష్పాలతో అలంకరించిన ఈత మట్టలను చేతబూని క్రీస్తు గీతాలు ఆలపిస్తూ వీధులలో ఊరేగింపు జరిపారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు జరిపి క్రీస్తు గీతాలను ఆలపించారు.

● అమృతలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పలు గ్రామాల్లో చిన్నారులు, మహిళలు మట్టల ఆదివారం పురస్కరించుకుని ఈత మట్టలను సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో ర్యాలీ జరిపారు. ఏసు క్రీస్తు పాటలను పాడారు. పెదపూడిలోని బాప్టిస్టు చర్చిలో పాస్టర్ డాక్టర్ అత్యాల పాల్‌నిరంజన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు. క్రీస్తు బోధనలు, ఆచరించాల్సిన మార్గాలను ఆయన బోధించారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రెండు మండలాల పరిధిలోని గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని పాస్టర్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు గీతాలు ఆలపించారు. చిన్నారులు ఈత మట్టలకు రంగు రంగుల పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో యేసు జయ ప్రవేశ ర్యాలీలో క్రీస్తుగీతాలు ఆలపించారు.

వక్ఫ్ బిల్లు సవరణను వెంటనే రద్దు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మతపెద్దలు, గ్రామ యువకులు, ముస్లింలు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బిల్లు సవరణకు వ్యతిరేకంగా చందోలు గ్రామంలోని అన్ని మసీదులకు చెందిన మతపెద్దలు, గ్రామ యువత, ముస్లింలు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. మండలంలోని చందోలు మేజర్ గ్రామపంచాయతీలో ఆదివారం మతపెద్దలు, గ్రామ యువత, గ్రామంలోని అన్ని మసీదులకు చెందిన ముస్లింలు ర్యాలీగా చందోలు హైస్కూల్ నుంచి బాపట్ల-పొన్నూరు కూడలి పెట్రోల్ బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు మతపెద్దలు మాట్లాడుతూ వక్ఫ్‌బిల్లును వెనక్కితీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వక్ఫ్‌బిల్లుపై ఆలోచన చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చందోలులో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భీమావారిపాలెం రామాలయంలో అన్నదానం

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భీమావారిపాలెంలో ఉన్న శ్రీ కోదండరామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ నాయకులు రౌతురామాంజనేయులు, లేళ్ళ నరేంద్రనాధ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొని అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు. శ్రీ సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబటి మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, మాజీ కౌన్సిలర్ జిట్టా కన్యాకుమారి శ్రీనివాసరావు, కత్తి మురళీకృష్ణ, జి.గిరిజారాణి, కారుమూరి శ్రీనివాసరావు, లేళ్ళ రమేష్, భీమా రాము తదితరులు పాల్గొన్నారు.


భీమావారిపాలెంలో పూజలు చేస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్ తదితరులు

పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా విన్నకోట

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు. 2025-2027 సంవత్సరానికి గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ పీవీ కృష్ణయ్య, అధ్యక్షుడిగా విన్నకోట సత్యప్రసాద్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ పీసీ సాయిబాబు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కొలగాని సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా పర్వతరెడ్డి సుబ్బారావు, రావూరి నరసింహవర్మ, కోశాధికారిగా తుళ్ళూరి రామప్రసాద్, కోఆర్డినేటర్‌గా బి.బాబునాగేంద్ర, కార్యవర్గ సభ్యులుగా కొమ్మూరి సీతారామాంజనేయులు, కందుల సీతారాంకుమార్, బందాబాబు, కేశవులు, జి.ఏలీషా, పి.శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, గుంటూరు రామసుబ్బారావు, ఖాజాఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

అందరిని ఆదుకుంటాం : ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడే వారందరికి ఆర్థికసాయం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. పట్టణ, మండలంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మొత్తం 11మందికి రూ.20,46,896 చెక్కులు అందించి ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండలపార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, మాజీకౌన్సిల్ కె.రమేష్, అశోక్ పాల్గొన్నారు.

టీటీడీ గోమరణాలపై భూమన అసత్యప్రచారం : వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీటీడీ గోమరణాలపై ఆసత్యప్రచారం చేయటం సిగ్గుచేటు అన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయని కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, డెలివరి సమయంలో, వ్యాధులతో నెలకు సగటున 10 ఆవులు వరకు మృత్యువాత పడుతుంటాయన్నారు. అయితే కరుణాకర్‌రెడ్డి అసత్యప్రచారం చేయటం సరికాదన్నారు.

మత్తు బిళ్లల విక్రయం కేసులో నిందితురాలి అరెస్టు

బాపట్లరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురంనకు చెందిన పోలా విజయలక్ష్మి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో యువకులకు మత్తుబిళ్లలు, నాటుసారాయి అమ్ముతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నది. పోలీసులకు, డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ వారి కళ్ళుకప్పి తిరుగుతున్న విజయలక్ష్మిని ఆదివారం వెదుళ్ళపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆమెను కోర్టుకు హాజరుపర్చినట్టు ఎస్ఐ భాగ్యరాజ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం కట్టవాద గ్రామానికి చెందిన నూతలపాటి రవికుమార్ (43) ఆదివారం పట్టణంలోని నరాలశెట్టిపాలెంలో ఉరి పెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం నరాలశెట్టిపాలెంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ తరచూ ఆమెతో గొడవపడుతూ ఉండేవాడు. ఆదివారం ఉరిపెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

వృద్ధురాలి ఇంటిని కూల్చిన అగంతకులు

చుండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : దుండిపాలెంలో కొత్తగా రేకుల షెడ్డు వేసుకుని నివాసం ఉంటున్న వృద్ధురాలు కాసు సుగుణ ఇంటిని శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఇంటి పైకప్పుకు వేసుకున్న రేకులు, దర్వాజాలు ధ్వంసం చేశారు. ఆ సమయంలో తను పొలం పనులకు వెళ్లగా ఈ సంఘటన జరిగిందని వృద్ధురాలు చుండూరు పోలీసులను ఆశ్రయించింది.

తొట్టెంపూడిలో యడ్లపాటి విగ్రహావిష్కరణ

చుండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సంక్షేమానికి మాజీ మంత్రి యడ్లపాటి వెంకట్రావు చేసిన కృషి ఉభయ తెలుగు రాష్ట్రాలలో రైతాంగం ఎప్పటికి మరిచి పోలేరని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తొట్టెంపూడిలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి యడ్లపాటి వెంకట్రావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కామినేని మాట్లాడుతూ, ఎన్‌జి రంగా అనుచరునిగా రాజకీయ జీవితం ప్రారంభించిన యడ్లపాటి జీవితాంతం రైతాంగం అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, పెద్దాయనగా పార్టీలోను ప్రజలలోను యడ్లపాటికి ప్రత్యేక గుర్తింపు గౌరవం ఉందన్నారు. కార్యక్రమంలో కొల్లూరు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆనందబాబు

సేవా కార్యక్రమాలు అభినందనీయం : సర్పంచ్

అమృతలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను స్మరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ మండవ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గోవాడలో పావులూరి శివరామకృష్ణయ్య, అమెమ్మల జ్ఞాపకార్థం గూడవల్లి ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. గ్రామంలో సేవా కార్యక్రమాల్లో పావులూరి సుబ్బారావు తనదైన శైలిలో సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పావులూరి బాలకృష్ణ, ఉప్పల సాంబశివరావు, పావులూరి కృష్ణబాబు, నన్నపనేని రంగారావు, మైనేని రత్నప్రసాద్, గూడవల్లి నేత్ర వైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గురువు ఆశీస్సులు అందుకున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి

బాపట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలో డీజీపీగా పనిచేసి రిటైర్డ్ అయిన ఐపిఎస్ అధికారి డాక్టర్ సి.హెచ్.ప్రతాపరెడ్డి ఆదివారం బాపట్ల విచ్చేశారు. శ్రీ శారదా విద్యామందిరం పూర్వవిద్యార్థి అయిన ఆయన తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టును కలిసి ఆశీస్సులు అందుకున్నారు. ఎంతోకాలం తర్వాత గురువును కలుసుకొని కుటుంబ నేపథ్యం గురించి వివరించి సంతోషం వ్యక్తం చేశారు.


నారాయణభట్టు ఆశీస్సులు తీసుకుంటున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ ప్రతాపరెడ్డి

తోటివారికి సహాయపడాలనే సద్గుణాన్ని పెంపొందించుకోవాలి

రేపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : తోటివారికి మనుకున్నంతలో కొంతైనా సహాయం అందించి వారికి తోడ్పాటును అందివ్వాలని మాజీ ఎంపీపీ చందోలు దేవదాసు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముందస్తుగా జయంతి సందర్భంగా ఆదివారం బేతపూడిలోని ఎస్టీ కాలనీలో పేదలకు దుస్తులు, దుప్పట్లు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్ళాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు దారం సాంబశివరావు, జూలకంటి బుజ్జిబాబు, వెంకటేశ్వరరావు, గుంటూరు రెడ్డయ్య, ఎస్.నరేష్, అశోక్‌బాబు, విల్సన్, శేషు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్!

● సకాలంలో సిబ్బంది స్పందించడంతో తప్పిన పెను ప్రమాదం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : బాపట్ల రైల్వే స్టేషన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల కరెంటు బాక్సులోకి నీరు వెళ్లడంతో షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ కౌంటర్ పక్కనున్న గదిలో ఈ ఘటన జరిగింది. సమీపంలోని సిబ్బంది మంటలను గమనించి వెంటనే అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. స్టేషన్ మొత్తానికి ఓ పదినిమిషాల సేపు కరెంటు ఆపి మంటలను అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.


షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ స్వర్ణోత్సవ సమ్మేళనం

కొల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తరువాత మళ్లీ కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో 1974-75 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ స్వర్ణోత్సవ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఉత్తములుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు కొనరాజు అప్పారావు, యలమకంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, వీరాస్వామి, గుమ్మడి రామమోహనరావులను వేడుకకు ఆహ్వానించి వారిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులను గురువులు అభినందించి ఆశీర్వచనాలు అందజేశారు. వేడుకల నిర్వహణకు కృషి చేసిన సహచర విద్యార్థి సుంకర రామమోహనబాబు, ఎన్నారై చెరువు రాధాకృష్ణమూర్తి, బాపట్ల శ్రీనివాసరావులను పూర్వ సహచర విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ, ఘంటా శివరంగారావు పాల్గొన్నారు.


కొల్లూరులో ఆత్మీయ స్వర్ణోత్సవ సమ్మేళనంతో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పీకేఆర్ జూనియర్ కళాశాలలో...

కర్లపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని 2004-2006 సంవత్సరం పీకేఆర్ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థులు అన్నారు. పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ విద్యార్థులు ఆదివారం కలిశారు. వారు తమ తీపి గుర్తులను నెమరవేసుకున్నారు. గురువులు తుమ్మల శ్రీనివాసరావు నాయుడు, రెడ్డి విజయకుమార్, ఈ.పోలీసురావు, రామ్మోహనరావు, ఆనంద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జై.సుశన్న, ఎస్.శివపార్వతి, కుమార్, బి.రాజేష్, శ్రీను, హరిత, నాగరాజు, తదితర పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పీకేఆర్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు

పండిత సుబ్బరాయశర్మకు శైవాగమ పంచానన బిరుదు ప్రదానం

వేమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జంపని గ్రామానికి చెందిన శైవాగమ పండితులు ప్రతిష్ఠ ఆగమాచార్య బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయశర్మను ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సత్యనందగిరిస్వామి చేతుల మీదుగా శైవాగమ పంచానన బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం సంగోడి గ్రామంలో ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయం వారి పర్యవేక్షణలో సిద్ధి సంగమేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం జోనల్ ఇన్‌చార్జి రజనీ దీదీ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భారతీయతత్వ దర్శన కేంద్రం నిర్వాహకులు, ధార్మిక ప్రచారకర్త, పార్వతీపురం శ్రీ క్షేత్రం కన్వీనర్ దుర్గా బాలాజీ, టీడీపీ ఇన్‌చార్జి సీతక్క విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.


పండిత సుబ్బరాయశర్మకు సేవాగమ పంచానన బిరుదు ప్రదానం చేసి సత్కరిస్తున్న సత్యానందగిరిస్వామి

సేవా రత్న అవార్డు అందుకున్న మురళీమోహన్

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాం జాతీయ సేవా రత్న అవార్డును ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్‌కు కృతి ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. మండల పరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మురళీమోహన్ గత ఏడాదిలో కృష్ణానదికి వచ్చిన వరదల సమయంలో లంక గ్రామాల్లోని విద్యార్థులకు విశిష్ట సేవలు అందించిన సందర్భంగా కృతి ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా చీరాల రోటరీ క్లబ్‌లో సీఐ సాంబశివరావు, నాగమణి, అమర్‌నాథ్, వెంకటఅశ్వినిలు ఈ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ, సమాజ సేవ చేయడంలో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఈ అవార్డు ద్వారా తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో సోషల్ ఫోరం సభ్యులు నాగిరెడ్డి, శేఖర్, శ్రీనివాసరెడ్డి, వై.శ్రీను, లక్ష్మణరావు, నాగరాజు పాల్గొని అభినందనలు తెలిపారు.


మురళీమోహన్‌కు సేవా రత్న అవార్డు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి సామూహిక హారతులు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అద్దేపల్లి రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైత్ర శుక్ల పక్ష పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వారికి సామూహిక హారతులను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళ కన్వీనర్ అరుణకుమారి మాట్లాడుతూ, దీపం పరబ్రహ్మ స్వరూపమని, సైన్స్ పరంగా కూడా సామూహిక హారతుల వల్ల వాతావరణంలో చెడు క్రిములు తొలగి వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, వి.శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సుభాషిణి, శ్రీలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

రూ.10.75 కోట్లతో నూతన వంతెన నిర్మాణం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై రూ.10.75 కోట్ల అంచనాల వ్యయంతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సాగునీటి పారుదల శాఖ ఎస్ఈ పి.వెంకటరత్నం తెలిపారు. ఆదివారం వంతెన పనులను ఏఈ సువర్చలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులను ప్రారంభించామని, వచ్చే ఖరీఫ్ నాటికి వంతెన నిర్మాణం పనులు సకాలంలో పూర్తి చేస్తామని ఎస్ఈ తెలిపారు. పరిశీలనలో సాగునీటి శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్బర్ సరే.. మా గతేంటి..?

- ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుపై రైతుల ఆందోళన
- అక్కడ నిర్మాణం జరిగితే తాగు, సాగు నీటికి ముప్పు
- పాడిపంటలు దెబ్బతింటాయని ఆగ్రహం
- గవినివారిపాలెం ఎత్తిపోతల వద్ద నిరసన
- ఎమ్మెల్యే దృష్టికి సమస్య



ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్



గవినివారి పాలెం పంపింగ్ స్కీం వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

చీరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వాడరేవులో నిర్మాణం జరగాల్సిన ఫిషింగ్ హార్బర్‌ను ఇటీవల జరిగిన అధ్యయనాల కారణంగా ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌లో నిర్మించేందుకు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ కోస్టల్ ఫిషరీస్ సంస్థ నివేదికను అందించింది. వాడరేవు సముద్ర తీరంలో హార్బర్ నిర్మించేందుకు 2014లోనే కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసి రూ.450 కోట్లు అంచనాలతో సిద్ధం చేసిం ది. కాలక్రమేణా వివిధ కారణాలతో హార్బర్ అటకెక్కింది, అయితే తాజాగా జరిగిన అధ్యయనాలతో అధికారులు ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్‌ను ఆధునీకరణ చేసి పడవల రాకపోకలకు కాలువను విస్తరించి కట్టలు పటిష్ఠంచేసి జెట్టీలు నిర్మిస్తే రూ.225 కోట్లతోనే హార్బర్ నిర్మా ణం జరుగుతుందని అంచనా వేశారు. అందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

మండల పరిధిలో ఎత్తిపోతలకు దెబ్బ

ఇదే తరహా ప్రణాళిక సిద్ధమైతే చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెం, గవినివారి పాలెం, అక్కయ్యపాలెం పంపింగ్ స్కీంలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. స్ట్రయిట్‌కట్ ఆధునికీకరణ జరిగితే సముద్ర జలాల ఉధృతి ఉంటుంది. అలాగే హార్బర్ వ్యర్థాలను భూమిలోకి వదులుతారు. ఈక్రమంలో ఉప్పు నీటి శాతం విస్తరించి స్ట్రయిట్‌కట్‌కు అనుసంధానంగా ఉన్న మూడు ప్రభుత్వ, మరో నాలుగు ప్రైవేటు పంపింగ్ స్కీంలు ఉప్పు నీటితో దర్శనమిస్తాయి. ఈ నేపథ్యంలో తాగు, సాగు నీరు అందక రైతులు, ప్రజలు, పశు పక్షాదుల జీవన మనుగడ కష్టం తరంగా ఉంటుంది. ఇది ప్రస్తుతం రైతుల్లో నెలకొన్న ఆందోళన. ఈ మూడు ఎత్తిపోతలకు సంబంధించి సుమారు 12వేల ఎకరాల పంట సాగు భూమి ఉంది. అలాగే అనుబంధంగా 20 గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. ఈక్రమంలో వేల సంఖ్యలో ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అధికారులు మరోమారు పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలావుండగా రైతులు హార్బర్ నిర్మాణం ప్రణాళికలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలోనే ఆదివారం గవినివారి ఎత్తిపోతల పథకం వద్ద నిరసనకు దిగారు. దీనిపై మరోరెండు రోజుల్లో రైతులు కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు.

సమస్యపై ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

హార్బర్ అంశం తెరపైకి రావడంతో తిరుమల తిరుపతి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దృష్టికి ఇప్పటికే రైతులు తీసుకువెళ్లారు. ఆదివారం నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్‌ను రైతు సంఘాల నాయకులు, రైతులు కలిసి సమస్యను వివరించారు. హార్బర్‌ను కొత్త ప్రాంతంలో నిర్మిస్తే పంట పొలాలు దెబ్బతింటాయని, గతంలో ఎంపిక చేసినచోటే నిర్మించాలని కోరారు. దీంతో డా.మహేంద్రనాథ్ స్పందిస్తూ రైతులకు, ప్రజలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటే వెంటనే సమస్యను ముఖ్యమంత్రి, మారిటైం బోర్డు అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

హార్బర్ నిర్మిస్తే.. మా పరిస్థితి ఏమిటి?



హార్బర్ నిర్మాణానికి వ్యయం తగ్గుతుందని ఆలోచించే పాత చోట కాకుండా కొత్త ప్రాంతంలో నిర్మిస్తే మా బతుకులు ఏమి అవ్వాలి. ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు సమాచారం ఉంది. నిర్మాణం జరిగితే రైతులకు తీవ్ర నష్టం తప్పదు. అధికారులు ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలి.

- నక్కల లక్ష్మణ, గవినివారిపాలెం పంపింగ్ స్కీం అధ్యక్షుడు

తాగు, సాగు నీటికి ఇబ్బందులు



హార్బర్ నిర్మాణం జరిగితే తాగు, సాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. దీంతో ప్రజలు, పశు పక్షాదులు జీవించే పిరిస్థితి ఉండదు. అంతా నష్టపోయి ప్రజలు, రైతులు వలసబాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. నిర్మాణాన్ని ఒప్పుకోం.

- గవిని శ్రీనివాసరావు, తోటవారి పాలెం పంపింగ్ స్కీం అధ్యక్షుడు

హార్బర్‌తో అనర్థమే



ఈపూరుపాలెం స్ట్రయికట్‌లో హార్బర్ నిర్మాణం అనర్థమే. మేమంతా చిన్న, సన్నకారు రైతులం. కొందరయితే పది, ఇరవై సెంట్లలో ఆకు కూరలు, కూరగయాలను పండించి జీవనం సాగిస్తున్నారు. హార్బర్ వస్తే ఇక పంటలు ఉండవు. అందరూ పొలాలను విడిచి వలస పోవాలి.

- జీ శ్రీనివాసరావు, అక్కయ్యపాలెం పంపింగ్ స్కీం అధ్యక్షుడు



ముప్పవరంలో కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

మంత్రి గొట్టిపాటి పరామర్శలు

పంగులూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ముప్పవరం గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన కుక్కపల్లి భాస్కరరావు తల్లి కాంతమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించిన మంత్రి గొట్టిపాటి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత నెలలో ముప్పవరం నుంచి ఆటోలో రావినూతల కూలి పనులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మరణించిన కొమ్ము సలోమి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దాసరి పుష్పాలు, కొమ్ము పాపమ్మను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ కుక్కపల్లి సుబ్బారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, ధూళిపాళ్ల రామచంద్రప్రసాద్, కుక్కపల్లి ఏడుకొండలు, పంగులూరు డి.సి. చైర్మన్ కుక్కపల్లి ఆంజనేయులు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, నార్నె సుబ్బారావు, జగన్మోహన్, దాసరి నాగేశ్వరరావు, జె.కె.సి, చిన్న, కాజా, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి : కలవకూరుకు చెందిన లచ్చిబోయిన నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆదివారం మంత్రి గొట్టిపాటి పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు పరమేష్ ఉన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు వెంపరాల, 9-45 గంటలకు అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెం, 10 గంటలకు బంగ్లా రోడ్డులో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించనున్నారు. 11 గంటలకు రామాయపాలెంలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 12-30కి ఇంకొల్లు మండలం భీమవరంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు.

నేడు ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

పర్చూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఆదివారం క్యాంపు కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుక

ర్యాలీ నిర్వహించిన క్రైస్తవులు, చిన్నారులు

చీరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పలు చర్చిలు, వీధులలో క్రైస్తవులు, చిన్నారులు మట్టల ఆదివారం (పామ్) వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మట్టలకు పూలతో అలంకరించి ర్యాలీ నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకు వారం ముందు క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని జరుపుకుంటారు. శ్రమల కాలం (లెంట్ డేస్)లో క్రీస్తు ఏసును రక్షకుడిగా అంగీకరిస్తూ ప్రజలు స్వీకరించిన రోజుగా మట్టల పండుగను జరుపుకుంటారు. మతబోధకులు ప్రార్థనలు చేశారు.

యద్దనపూడి : యద్దనపూడి మండలంలోని పూనూరులో లూథరన్ చర్చిలో ఆదివారం మట్టల పండుగను వేడుకగా జరుపుకున్నారు. సంఘ కాపరి రాజేష్ ఆధ్వర్యంలో సండే స్కూలు పిల్లలు రంగురంగుల పూలతో అలంకరించిన మట్టలతో ప్రదర్శన, కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సండే స్కూలు పిల్లలు పాల్గొన్నారు.

అద్దంకి : మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు వేడుకగా జపుకున్నారు. పట్టణంలోని గరటయ్య కాలనీలో బిలీవర్స్ ఆస్ట్రన్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. పాస్టర్ కాంతారావు, కరుణజ్యోతి, రతనపాల్, ఇశ్రాయిల్ పాల్గొన్నారు.

రోడ్డుపై బోల్తాపడిన గడ్డి ట్రాక్టర్

గంటల తరబడి నిలిచిన వాహనాలు

పూసపాడు(పర్చూరు), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు - ఇంకొల్లు పాతమద్రాస్ రోడ్డులోని పూసపాడు సమీపంలో ఆదివారం గడ్డి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో ఎక్కడ వాహనాలు అక్కడే గంటల తరబడి నిచిపోయాయి. ఒక్క పక్క ఎండ, మరోపక్క ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు నరకం చూశారు. పోలీసులు చేరుకొని ట్రాక్టర్‌ను తొలగించి వాహనరాకపోకలకు అవకాశం కల్పించారు. పర్చూరు - ఇంకొల్లు రోడ్డు అధ్వానంగా ఉంది. పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లతో ప్రయాణాలు కష్టతరంగా మారాయి. దీంతో ఈ రోడ్డులో తరచూ వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి.

బస్సును ఢీకొన్న లారీ

దాని వెనుక మరో లారీ .. డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : గొర్రెపాడు జంక్షన్ రోడ్డులో ఆదివారం ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. వెంటనే వెనక ఉన్న మరో లారీ ముందు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు సంతమాగులూరు వైపు నుంచి అద్దంకి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు గొర్రెపాడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కొంత నెమ్మదిగా ఆగడంతో వెనక వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. దాని వెనుక వస్తున్న లారీ ముందున్న లారీని ఢీకొట్టింది. ఈప్రమాదంలో బస్సు వెనక భాగం దెబ్బతినగా, లారీ ముందు భాగం దెబ్బతింది. లారీ డ్రైవర్ నక్కా మోషే, క్లీనర్ దాసరి నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



అవార్డు గ్రహీతలతో యువనేత గౌరీ అమర్‌నాథ్, ఫౌండేషన్ అధ్యక్షురాలు నాగమణి, చైర్మన్ అశ్విని

సామాజిక సేవలతో ఆనందం

చీరాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలతో ఆనందం ఉంటుందని టీడీపీ యువనాయకులు గౌరీ అమర్‌నాథ్ అన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సేవలందిస్తున్న 120 మందికి కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపికలతో సన్మానించారు. ఆదివారం రోటరీ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డా.బేబీరాణి, చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, మెరైన్ సీఐ సాంబశివరావు, వన్‌టౌన్ సీఐ సుబ్బారావు, డా.అమృతపాణి పాల్గొన్నారు.

నేడు భీమవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఇంకొల్లు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరగనున్న ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య, బాచిన చెంచుగరటయ్య హాజరవుతారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీ పరీక్షలు



మాట్లాడుతున్న రాజశేఖర్

మేదరమెట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కిరణ్‌జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందేపు రాజశేఖర్ తెలిపారు. ఆదివారం దైవాలరావూరులోని కిరణ్‌జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రా మంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కిరణ్‌జ్యోతి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో కోటేశ్వరరవు, జ్యోతిప్రసన్న, ముఫీద, జూనియర్స్ విభాగంలో జయశ్రీ, జనని, కావ్య మొదటి స్థానం సాధించారు. అనంతరం గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని మెక్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సజ్జా విజయలక్ష్మి ప్రారంభించారు. కిరణ్‌జ్యోతి ఫౌండేషన్ చేసిన అభివృద్ధి పనులను సర్పంచ్ కోనూరి శీతామహలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కోటేశ్వరమ్మ, సుభాషిణి, కోటేశ్వరరావు, బాలు, ప్రియదర్శిని పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత పాఠశాలలో 1979 - 1980లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాత్రి జరిగింది. అప్పట్లో టెన్త్ చదివిన 35 మంది ఒక్కచోట కలిశారు. ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఈ కలయికకు కృషి చేసిన చెన్నుపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గుంటుపల్లి మురళిని అందరూ అభినందించారు. అనంతరం ఇంటూరి శంకరరావు మాస్టారిని సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఇన్వెర్టర్‌ను అంద జేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతురావు, ఉపాధ్యాయులు డేవిడ్‌పాల్, పార్థసారథి పాల్గొన్నారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అకాల వర్షం... రైతుల్లో కలవరం



మక్తేశ్వరంలో ధాన్యం, మొక్కజొన్న తడవకుండా పట్టలు కప్పుతున్న రైతులు, పంగులూరులో పొగాకు మండెలపై పరదాలు కప్పుతున్న రైతులు, ఇసుకదర్శిలో ఇంటివద్ద ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలపై పరదా కప్పుతున్న రైతు

- పెద్ద ఎత్తున గాలులు
- విరిగిన స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో రైతులు ఉరుకులు పరుగులు తీసారు. ఆదివారం పగలంతా సెగలు కక్కిన ఎండతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా, సాయంత్రం 4 గంటల సమయానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం అయింది. ఒక్క సారిగా పెద్ద ఎత్తున గాలులు ప్రారంభమై వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో మొక్కజొన్న, మిర్చి కల్లాలలో ఆరబెట్టగా వాటిని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీసారు. దీంతో కొంత మేర తడవడంతో రైతులు ఆందోళన చెందారు. ప్రధానంగా బల్లికురవ, సంతమాగులూరు, అద్దంకి తదితర మండాలలో గాలులు, వర్షం ఉంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో సైతం సరఫరా నిలిచిపోయింది. మణికేశ్వరం, వెంపరాల తదితర గ్రామాల్లో స్తంభాలు విరిగాయి. బల్లికురవ మండలం చెన్నుపల్లిలో మొక్కజొన్న పడిపోయింది. పొలాల్లో ఉన్న మిర్చి, జొన్న గాలులకు తీవ్రంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంగులూరులో గాలి బీభత్సం

పంగులూరు : ఆదివారం వీచిన ఈదురు గాలులు, కురిసిన వర్షం రైతులను పరుగులు పెట్టించింది. ఎండేందుకు కల్లాలలో ఆరబోసిన మొక్కజొన్న, మిర్చితో పాటు ఎండేందుకు పందిళ్లకు కట్టిన పొగాకు తాళ్లు, మండెలు వేసి ఉన్న బర్లీ పొగాకు తడవకుండా పరదాలు కప్పేందుకు రైతులు పరుగులు తీశారు. నల్ల బర్లీ కొనుగోలు మొదలవక సతమతమవుతున్న రైతులకు ఆదివారం వీచిన ఈదురు గాలులు, అకాల వర్షంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆరు గా లం శ్రమించి పండించిన మొక్కజొన్న కోత అనంతరం ఆరబోసి అమ్ముకునేందు కు సిద్ధమవుతున్న తరుణంలో వర్షం కొంప ముంచుతుందని రైతులు వాపోతున్నారు. కొండమూరు, ముప్పవరం, కోటపాడు, రేణంగివరం, భైటమంజులూరు, కొండ మంజులూరు పరిసర గ్రామాలలో విస్తారంగా మొక్కజొన్న సాగు చేపట్టారు. కొండమూరులో 11వందల ఎకరాలలో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. నిలువుమీద ఉన్న జొన్న పైరు నేల వాలిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండెల మాటున, పందిళ్లకు వేలాడుతున్న నల్లబర్లీ పొగాకు ఈదురు గాలులు, అకాల వర్షం తమ కొంప ముంచుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు అలవలపాడు గ్రా మ ప్రధాన కూడలిలో, కొండమూరులో విద్యుత్ తీగలు తెగిపోయి సరఫరా ని లిచిపోగా పునరుద్ధరణకు సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు.

చినగంజాం : అకాల వర్షంతో మండల పరిధిలోని పొగాకు, మిర్చి, ఉప్పు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉరుములు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. మండలంలోని సంతరావూరు, గొనసపూడి ప్రాంతాల్లో మిర్చి, పొగాకు వర్షానికి దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరపకాయలు తాలుకాయిలుగా మారుతాయిని చెప్తున్నారు. పందిళ్లపై ఉన్న పొగాకు వర్షానికి తడిస్తే నల్లగా మారుతుందని, నల్లగా మారిన పొగాకును ఎవరూ కొనుగోలు చేయరని అంటున్నారు. చినగంజాం, పెదగంజాం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, సోపిరాల ఉప్పు మడులలో వర్షపునీరు చేరింది. దీంతో ఉప్పు కరిగిపోతుందని ఆవేదన చెందుతున్నారు.

పర్చూరు : అకాల వర్షంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వైట్‌బర్లీ, మిర్చి పొలాల వద్దే ఉండడంతో తడిసిపోతుందని ఆందోళనకు గురయ్యారు. వాన కురిస్తే నష్టపోతామని ఆవేదనవ వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 40వేల ఎకరాల్లో వైట్‌బర్లీ, 15వేల ఎకరాల్లో మిర్చిని రైతులు సాగు చేశారు.

మార్టూరు : ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పొలంలో మొక్కజొన్న కోసిన రైతులు ఆందోళనకు గురయ్యారు. కోలలపూడి, జొన్నతాళి, ఇసుకదర్శి తదిర గ్రామాలలో మొక్కజొన్నను కల్లాల్లో ఆరబెట్టారు. కొంతమంది విత్తనాలను ఇంటి వద్ద ఆరబెట్టారు. వాటిని కాపాడుకునేందుకు రైతులు పట్టలు కప్పుకున్నారు. 15 నిమిషాల తర్వాత వర్షం ఆగడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఘనంగా సీతారాముల వసంతోత్సవం

చినగంజాం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరం వద్ద సీతారాముల వసంతోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించి, ఎనిమిదవ రోజైన ఆదివారం స్వామి వారికి అమ్మవారి మందిర కమిటీ సభ్యులు, మహిళా భక్తులు వసంతోత్సవాన్ని జరిపారు. ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి పురవీధులలో జై శ్రీరామ్ నామ స్మరణలతో ఊరేగించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : కొణిదెనలోని చెన్నకేశవ స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారి అయిన వేలు శోభనాచార్యులు కళ్యాణ వేడుకలను నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణ అధికారి శిరీష కార్యక్రమంలో పాల్గొన్నారు.

360 మందికి వైద్య పరీక్షలు

పర్చూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాలలో చిన్నయామిషన్ నిర్వహణలో శంకర్ కంటి ఆసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 360 మందికి పరీక్షలు చేశారు. విద్యాదాత కీర్తిశేషులు పాబోలు రాధాకృష్ణమూర్తి, ఇందిరాదేవి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 200 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు పాబోలు ఉదయభాస్కర్, ధర్మపత్ని గిరిజా కుమారి తెలిపారు. కార్యక్రమంలో రొటేరియన్‌లు ప్రసాద్, రమేష్ చంద్ర, శ్రీనివాసరావు, గిరినాథరెడ్డి, చిన్మయామిషన్ ప్రతినిధులు అజయ్‌బాబు, లింగేశ్వరరావు, వెంకటేశ్వశరావు పాల్గొన్నారు.

నేడు స్వామివారి నామాల ప్రతిష్ఠ

బల్లికురవ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామస్థుల సమష్టి కృషితో వెంకటేశ్వరస్వామి శంకు చక్రాలు, నామాల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం ఉదయం జరగనుంది.